
ఆ నేతలు ఎక్కడ?



- అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు
- ఇష్టారాజ్యంగా దందాలు, భూ ఆక్రమణలు
- ఇసుక, మట్టి దోపిడీ
- ఎన్నికల్లో బుద్ధి చెప్పిన ప్రజలు
- ప్రస్తుతం ఇంటి గడప దాటని వైనం

విజయనగరం (ఆంధ్రజ్యోతి)

అధికార మదం తలకెక్కితే ప్రజలే నేలకు దించుతారన్న విషయం వైసీపీ విషయంలో రూడీ అయింది. గత ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు చేసిన అరచకాలు, అక్రమాలు అన్నీఇన్నీ కావు. వారు చెప్పిందే వేదం.. చేసిందే చట్టం అన్నట్టు వ్యవహరించారు. రానున్న పదేళ్లు.. కాదు 30 ఏళ్లు తమకు తిరుగులేదన్నట్టు విర్రవీగారు. అధికార యంత్రాంగాన్ని గుప్పెట్లోకి తీసుకున్నారు. దందాలు, భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ఇసుక, మట్టి, కంకర ఇలా ప్రతిదీ దోచుకున్నారు. ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడ్డారు. అభివృద్ధి తక్కువ.. అరాచకం ఎక్కువ అన్నట్లు వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. అయితే, రాజకీయాలు ఎప్పుడు ఎలా మారుతాయో? చెప్పలేం. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉంటుందో? ఊహించలేం. 2024 ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. ప్రజలు వైసీపీని గద్దె దించారు. ఎన్‌డీఏ కూటమికి పట్టం కట్టారు. దీంతో గతంలో అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు ఇప్పుడు పూర్తిగా సైలెంట్ అయిపోయారు. ఓటమిని జీర్ణించుకోలేక ప్రస్తుతం ఇంటి గడప కూడా దాటేందుకు ఇష్టపడడం లేదు. దీంతో ఆ నేతలు ఎక్కడంటూ జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.



- విజయనగరం ఎమ్మెల్యేగా 2019లో విజయం సాధించిన **కోలగట్ల వీరభద్రస్వామి** ఐదేళ్ల పాటు అంతా తానై వ్యవహరించారు. ఆయనతో పాటు అనుచరులు బరి తెగించారు. జగనన్న కాలనీ కోసం స్థలం ఎంపిక, ఆ స్థలం ప్రభుత్వ కొనుగోలు వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారాయి. కొండకరకాం, సారిక ప్రాంతాల్లో స్థలాల కేటాయింపు ఏకపక్షంగా నిర్వహించారు. వైసీపీ మద్దతుదారులకే ఇళ్లు కేటాయించారు. విజయనగరం నగరపాలక సంస్థని వైసీపీకి అనుకూలంగా మార్చేశారు. కోలగట్ల ఏమి చేబితే అధికారులు అదే చేసేవారు. కోలగట్ల అనుచరులు నగరంలోని పలు చెరువులు, గెడ్డలను ఆక్రమించేశారు. మన్నార్ రాజగోపాల స్వామి ఆలయ భూముల్లో ఉన్న గెడ్డను కోలగట్ల ప్రధాన అనుచరుడు, ఆయన వ్యాపార భాగస్వామి కప్పేశాడు. ఈ ఎన్నికల్లో ఆయన్ను ఓడించేందుకు శత్రువులంతా చేతులు కలిపారు. ఫలితంగా ఘోర ఓటమిని చవిచూశారు. దీంతో ఆయన ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీకి రావాలని అధిష్ఠానం నుంచి పిలుపువచ్చినా వెళ్లలేదు. బొత్స స్వయంగా ఫోన్ చేసి పిలిచినా గడప దాటలేదు. తాను గెలిపించిన కార్పొరేటర్లు, పలువురు ఎంపీటీసీ, సర్పంచ్‌లే తనకు చావు దెబ్బకొట్టారని మదనపడుతూ ఇంటిలోనే ఉంటున్నారు.



- వైసీపీ ప్రభుత్వ హయాంలో బొబ్బిలి ఎమ్మెల్యేగా అధికార దర్పం వెలగబెట్టిన **శంబంగి వెంకట చినప్పలనాయుడు** ఇప్పుడు గప్‌చుప్ అయిపోయారు. జగన్ ఆయన్ను చినప్పలనాయుడు అన్నా అంటూ ఆప్యాయంగా పిలిచేవారు. దీనికి శంబంగి ఎంతో పొంగిపోయేవారు. రాష్ట్రంలో జగన్ ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా బొబ్బిలిలో ప్రెస్‌మీట్‌లు పెట్టి పొగడ్తలు గుప్పించేవారు. చిన్న, పెద్దా తేడా లేకుండా తనకు రాజకీయ భిక్ష పెట్టిన చంద్రబాబు నాయుడుతో పాటు పవన్‌కళ్యాణ్, అశోక్ గజపతిరాజు, బొబ్బిలి రాజులను తీవ్ర పదజాలంతో దూషించేవారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె సందర్భంగా వారిపై శంబంగి చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పెనుదుమారం రేపాయి. కాంట్రాక్టు వర్కులన్నీ తన సొంత కంపెనీకి లేదా బినామీలకే అప్పజెప్పేవారని విమర్శలు ఉన్నాయి. వారు నిర్మించిన పారాది కాజ్‌వే, పలు రోడ్లు వర్షాలకు కొట్టుకుపోయాయి. తన భూములకు ప్రజాధనంతో రోడ్లు వేయించుకున్నట్లు శంబంగిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు వైసీపీకి గట్టి దెబ్బ కొట్టేసరికి ఇప్పుడు ఇంటికే పరిమితమయ్యారు. ఆయన అండ చూసుకుని పార్టీ సోషల్ మీడియా పేరుతో రెచ్చిపోయిన అనుచరులు కూడా ప్రస్తుతం పిల్లికూనలు అయిపోయారు.




- గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన **బొత్స సత్యనారాయణ** జిల్లా రాజకీయాలను శాసించేవారు. తాను చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరించేవారు. సమావేశాల్లో ఎవరైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశ్నించినా, మాట్లాడినా చూపుడు వేళ్లతో సమాధానం చెప్పి కూర్చోబెట్టేవారు. చీపురుపల్లిలో నచ్చిన కార్యకర్తలకే కాంట్రాక్టులు అప్పజెప్పేవారు. ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. తమ్ముడు చేస్తున్న భూ దందాలకు కనీసం అడ్డు చెప్పేవారు కాదు. చీపురుపల్లిలోని రెస్కో కంపెనీలో ఉద్యోగాల విషయంలో ఆరోపణలు వచ్చాయి. అదే విధంగా టీచర్లను నచ్చిన చోటకు బదిలీల వ్యవహారంలో కూడా భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ఉత్తరాంధ్రకు 'నేనే పెద్దలీడర్'ను అని చెప్పుకునే బొత్స ఈ ఎన్నికల్లో కళా వెంకటరావు చేతిలో ఘోరంగా ఓడిపోయి ఇంటికే పరిమితమయ్యారు. ఇప్పుడు ఆయన ప్రెస్‌మీట్లకు పరిమితం అయ్యారు.




- రాజాం ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు పనిచేసిన **కంబాల జోగులు** నియోజకవర్గ ప్రజల కోసం చేసిందేమీ లేదు. ఆయన మాత్రం అన్ని శాఖల అధికారులను పావులుగా ఉపయోగించుకుని పైరవీలు చేసుకున్నారు. తాను చెప్పిందే శాసనం అన్నట్లు అధికారులకు హుకుం జారీ చేసేవారు. మండల పరిషత్‌కు సంబంధించిన స్థలాన్ని తక్కువ ధరకే తనవారికి ముట్టజెప్పారన్నా విమర్శలు ఉన్నాయి. కంబాల జోగులు అండతో గడ్డిముడిదాం గ్రామంలో ఆర్‌సీఎం చర్చి భూములను తక్కువ ధరకు కట్టబెట్టటానికి ప్రయత్నం చేశారని విమర్శలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో ఆయన పాయకరావుపేట నుంచి పోటీచేసి ఓడిపోయారు. అక్కడి నుంచే అప్పుడప్పుడు ఇక్కడి కార్యకర్తలతో టచ్‌లో ఉంటారు.



- గత ఐదేళ్ల పాటు నెల్లిమర్ల ఎమ్మెల్యేగా పని చేసిన **బడ్డుకొండ అప్పలనాయుడు** అక్రమార్జనే లక్ష్యంగా ముందుకు సాగారు. ప్రభుత్వ ఆసుపత్రిని తన కారుషెడ్‌గా, పశువుల శాలగా మార్చేశారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహకారంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి భోగాపురం మండలం రామచంద్రాపురం క్వారీని స్వాధీనం చేసుకున్నారు. నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి క్వారీని కూడా పొందేందుకు ప్రయత్నించగా టీడీపీ, ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. తన వ్యాపార సామ్రాజ్యంలో తన కుమారులకు కూడా కొన్ని బాధ్యతలు అప్పగించారు. డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురంలో తక్కువ ధరలకు భూములు కొనడమే కాకుండా, బంజారు, వివాదస్పద భూములపై దృష్టి సారించేవారు. ఉన్నతాధికారుల నుంచి క్లియర్ చేయించుకుని లే అవుట్లుగా మార్చేసి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు రాజకీయ కక్షలతో ప్రతిపక్ష నాయకులను అణచివేసేందుకు ప్రయత్నించారు. రామతీర్థం శేషాచలం కొండపై కోదండ రాముని తల విరగ్గొట్టిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రజలు, ప్రజా సంఘాలు, భక్తులు, టీడీపీ నాయకులు భారీగా నిరసన చేపట్టారు. ఈ విషయంలో అప్పట్లో కళా వెంకటరావుపై కేసు కూడా నమోదైంది. నెల్లిమర్ల మండలానికి చెందిన సువ్వాడ రవిశేఖర్‌తో పాటు మరో ఐదారుగురు జైలుకి వెళ్లారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన బడ్డుకొండ ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. అవసరం ఉంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వద్దకు వెళ్తుంటారు. అంతేతప్ప ఆయన బయటకు అడుగుపెట్టని పరిస్థితి నెలకొంది.



- గజపతినగరం ఎమ్మెల్యేగా **బొత్స అప్పలనర్సయ్య** పనిచేసిన గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు భూ ఆక్రమణలు, ఇసుక దందా, మట్టి దందాకు పాల్పడ్డారు. ప్రస్తుతం వారంతా అడ్రాస్ లేకుండా ఉన్నారు. ఎన్నికలు ముగిసి రెండు నెలలు కావస్తున్నా పార్టీ కార్యాలయం వైపు వచ్చేందుకు అప్పలనర్సయ్య ఇష్టపడడం లేదు. ఇప్పటికీ ఆయన వెనుక ఉండి ఇసుక దందా సాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాగే, నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఇళ్లకే పరిమితమై ఉన్నారు. స్థానిక సంస్థల్లో గెలుపొందిన వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల కార్యాలయానికి కూడా రాని పరిస్థితి నెలకొంది.



- ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే **కడుబండి శ్రీనివాసరావు** మొదటి నుంచీ ఇంటిపోరుతోనే రాజకీయాల్లో కొనసాగారు. ఈ ఎన్నికల్లో ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలే ఆయన్ను తిరస్కరించడంతో ఘోరంగా ఓడిపోయారు. ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లలో ఇసుక, మట్టి అక్రమ తరలింపులో భారీగా ముడుపులు అందాయన్న విమర్శలు ఉన్నాయి. దీంతో పాటు రాజుపాత్రునిపాలెం సమీపంలో ఉన్న కొండను చదును చేసి ఇంటి స్థలాలుగా మార్చేసి విక్రయించినట్లు సమాచారం. స్థానిక అధికారులు ఎవరైనా ప్రశ్నిస్తే ఉన్నతాధికారులతో వారికి ఫోన్ చేయించేవారు. ఆయన అండ చూసుకుని స్థానిక వైసీపీ నేతలు కూడా రెచ్చిపోయేవారు. ఇంటి స్థలాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అదే విధంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను బెదిరించిన ఆడియో సోషల్ మీడియలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. కడుబండి తమ్ముడు రమేష్‌నాయుడు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని తన అధీనంలో ఉంచుకుని దందా చేసేవారు. తానే ఎమ్మెల్యే అన్నట్లు అధికారులకు ఆదేశాలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఓటమిపాలైన కడుబండి బయటకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు.

తీరంలో దొంగలు

- రాత్రి సమయాల్లో తరలిపోతున్న సముద్రపు నల్ల ఇసుక
- గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు రవాణా
- కొరవడిన అధికారుల నిఘా
- రెండురోజుల కిందట ఇసుక తరలిస్తూ వాహనం బోల్తా



కొండ్రాజుపాలెం సమీప సముద్ర తీరంలో నల్ల ఇసుక తవ్వకాల దృశ్యం

తీరంలో దొంగలు పడ్డారు. సముద్రం ఒడ్డున ఏర్పడే నల్ల ఇసుకపై కన్నేశారు. రెండో కంటికి కనిపించకుండా అర్ధరాత్రి వేళ లారీల్లో తరలించుకుపోతున్నారు. ఈ ఇసుకలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వాడే ఇల్మనైట్, రుటైల్, జిర్కాన్, గార్నెట్ తదితర ఖనిజాలు ఉంటాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆయా ఫ్యాక్టరీల కోసం ఇక్కడ ఎవరి అనుమతి తీసుకోకుండా కొందరు వ్యక్తులు నల్ల ఇసుకతో వ్యాపారం చేస్తున్నారు. పగటిపూట అయితే దొరికిపోయే ప్రమాదం ఉంది. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా తీరం నుంచి భారీమొత్తంలో నల్ల ఇసుకను తీసుకుపోతున్నారు. రెండు రోజుల కిందట ఓ లారీ ఇలా వెళ్తూ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో విషయం బయటపడింది.

-భోగాపురం

ప్రకృతి సంపద దోపిడీపై మక్కువ.. వాల్టా చట్టం నిబంధనలు పట్టని తలబిరుసుతనం.. అధికారుల నిర్లక్ష్యాన్ని తమకు అనుకూలంగా మలుచుకునే వ్యూహంతో కొందరు వ్యక్తులు తీరంలో ఉండే నల్ల ఇసుకపై కన్నేశారు. ఆ ఇసుకలో ఉండే ఖనిజ దాతువుల గురించి తెలుసుకుని అడ్డదారి వ్యాపారం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉండే సంబంధిత వ్యక్తులతో పరిచయం పెంచుకుని తీరం నుంచి ఇసుకను గుట్టుగా తరలిస్తున్నారు. తీర గ్రామాల్లోని కొందరికి డబ్బు ఎర వేసి పగటిపూట ఇసుకను కుప్పలుగా వేయిస్తున్నారు. అర్ధరాత్రి వేళ లారీ ఎక్కువ సమయం ఉండకుండా కొద్ది నిమిషాల్లోనే లోడింగ్ కానిచ్చేసి తీసుకుపోతున్నారు.

జిల్లాలో ఇప్పటికే చెరువులు, కొండలు, గుట్టలు, నదుల్లో ప్రకృతి వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. చివరికి సముద్ర తీరాన్ని సైతం దోచుకుంటున్నారు. తీరంలో ఇలాంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. మీడియాలో వార్తలు వచ్చాక రవాణా నెమ్మదించడం.. తర్వాత విజృంభించడం సర్వసాధారణంగా మారింది. దీనిపై అధికారుల నిఘా పూర్తిగా కరువైంది. తవ్వకాలపై కాని, రవాణాపై కాని చర్యలు తీసుకోవడం లేదు. భోగాపురం మండ లంలో ఎర్రముసలయ్యపాలెం, చేపలకంచేరు, ముక్కాం, కొండ్రాజుపాలెం తదితర గ్రామాల పరిధిలో తీరం ఉంది. కెరటాల తాకిడికి తీరం వెంబడి అధికంగా నల్ల ఇసుక ఏర్పడుతోంది. ఈసుకలో అనేక విలువైన ముడి ఖనిజాలు ఉన్నాయని గతంలో శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ఆ ఖనిజాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కొందరు అక్రమార్కులు పరిశ్రమల యాజమాన్యాలతో గుట్టుగా ఒప్పందం చేసుకుని ఇక్కడి నుంచి నల్ల ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సముద్రపు ఇసుక తరలించడం వాల్టా చట్టప్రకారం కూడా నేరం.

- తీరం వెంబడి సముద్రపు ఇసుక దొంగలు పగలంతా సంచరించి నల్ల ఇసుక ఎక్కడ ఉందో పరిశీలించి కొంత మంది స్థానికుల చేత తవ్వకాలు జరిపించి గుట్టలుగా ఏర్పాటు చేసుకొంటున్నారు. అర్ధరాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా నల్ల ఇసుక పోగులను లారీలు, ట్రాక్టర్లలోకి ఎత్తించి తరలించుకుపోతున్నారు. కొంతకాలంగా ఈ వ్యవహారం జరుగుతూ ఉంది. అప్పుడప్పుడు పోలీసులు వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా నల్ల ఇసుక అక్రమ తరలింపు కొనసాగుతూనే ఉంది. అలాగే నల్ల ఇసుకను అధికంగా వేయడంతో బరువు ఎక్కువై వాహనం బోల్తా కొట్టిన సంద ర్భాలు అనేకం. ఆ సమయంలో ఇసుకను అక్కడే వదిలి వెళ్లిపోతున్నారు. మరికొంతమంది ఇసుకతో ఉన్న లారీలను కూడా వదిలి పరారవుతున్నారు.
- ఈనెల 30న అర్ధరాత్రి సమయంలో చేపలకంచేరు పంచాయతీ ఎర్రముసలయ్య పాలెం తీరం నుంచి నల్ల ఇసుకతో వెళ్తున్న వాహనం కొద్దిదూరంలో బోల్తా కొట్టింది. ఇసుకను అక్కడే వదిలేసి డ్రైవర్ వాహనంతో పరారయ్యాడు. ఘటనపై తహసీల్దార్ ఎం.సురేష్‌ను వివరణ కోరగా తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



వాహనం బోల్తా పడ్డాక బయట పడిన నల్ల ఇసుక

గంజాయి కోసం వెతికితే.. బంగారం పట్టుబడింది

- లాడ్జీలో పోలీసుల సోదాలు
- 4 కిలోల ఆభరణాల పట్టివేత
- ఇద్దరు నిందితుల అరెస్టు



లాడ్జీలో పట్టుబడిన బంగారు ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు

బొబ్బిలి, ఆగస్టు 2: గంజాయి కోసం ఓ లాడ్జీలో సోదాలు నిర్వహించిన పోలీసు లకు అక్కడ బంగారు ఆభరణా లు పట్టుబడ్డాయి. లాడ్జీలో బస చేసిన ఇద్దరు వ్యక్తుల నుంచి 4 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేశారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు వివ రాల మేరకు.. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బొబ్బిలి రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీసూర్య రెసిడెన్సీ (లాడ్జీ)లో గురువారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయితే, గంజాయితో ఉన్న వ్యక్తులు తృటిలో తప్పించుకున్నారు. ఈ క్రమంలో లాడ్జీలో ముమ్మరంగా సోదాలు చేపట్టారు. ఓ గదిలో బస చేసిన గుంటూరుకు చెందిన భవేశ్‌కుమావత్, గుజరాత్ రాష్ట్రం కంజిపానిలోని పంచమహల్‌కు చెందిన బరియా ఆనంద్‌కుమార్ వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 4 కిలోల బంగారు ఆభరణాలు దొరికాయి. వీటికి ఎటువంటి లెక్కలు చూపకపోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా గుంటూరు పట్నం బజారులోని శాంతి గోల్డ్ జ్యూయలరీ షాపు నుంచి ఆభరణాలను విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని బంగారు వర్తకులకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిపుణుడిని తీసుకొచ్చి బంగారు ఆభరణాల నాణ్యతను నిర్ధారించుకున్నామని, జీఎస్టీట అధికారులను రప్పించి వారి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆభరణాల వివరాలు..

33 రింగులు (238 గ్రాములు), 44 జతల చెవి దుద్దులు (250 గ్రాములు), 7 జతల జుమకాలు (48 గ్రాములు), చెవి రింగులు (198 గ్రాములు), 13 బ్లాక్ బీడ్ చైనులు (331 గ్రాములు), మోడల్ రింగులు (149 గ్రాములు), 52 జతల స్టడ్స్ (176 గ్రాములు) తదితర ఆభరణాలు మొత్తం సుమారు 4 కిలోలను సీజ్ చేసి కోర్టుకు అప్పగించినట్లు డీఎస్పీ చెప్పారు.

బడి ఎన్నికలకు వేళాయే!



విజయనగరం కస్పా ఉన్నత పాఠశాల

- విడుదలైన నోటిఫికేషన్
- 8న ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్, ఆగస్టు 2: జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 8న సమగ్రా శిక్ష అభియాన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో కమిటీలను పునర్నిర్మించాలి. కనీసం 50 శాతం తల్లిదండ్రులతోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. తరగతుల వారీగా ఎన్నికలు ఉంటాయి. ఆ తరగతిలో తల్లిదండ్రుల హాజరును కోరంగా తీసుకుంటారు. ఎన్నికలకు అయ్యే ఖర్చును మిశ్రమ పాఠశాల గ్రాంట్ల నుంచి చెల్లిస్తారు. హెచ్‌ఎం లేని పాఠశాలల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్నిక నిర్వహిస్తారు. జీపీఎస్ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న సీఆర్‌టీఎస్ కన్వీనర్‌గా వ్యవహరించవచ్చు. తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటువేసేందుకు అర్హులు. వివిధ తరగతుల్లో పిల్లలు ఉంటే అన్నిచోట్ల ఎన్నికల్లో పాల్గొనవచ్చు. ఇలా ఎన్నికైన సభ్యుల్లో ఒకరు చైర్మన్, మరొక వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. చేతులు చూపించడం, నోటితో చెప్పడం వంటి పద్ధతులతో వీరిని ఎన్నుకున్నారు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. రాజకీయ జోక్యం ఉండకూడదు. ఎన్నికలకు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదుచేసే అవకాశం ఉంటుంది. గ్రామ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, సహాయకుడు ఎన్నికల ప్రక్రియలో పరిశీలకులుగా పాల్గొనే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వం జారీచేసిన ఎటువంటి గుర్తింపుకార్డు అయిన చూపించి ఓటు వేయవచ్చు.

షెడ్యూల్ ఇదే..

పాఠశాలల్లో ఈ నెల 3 (శనివారం) వరకూ ఓటరు జాబితాను ప్రదర్శిస్తారు. 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఫిర్యాదులపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 8న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో సభ్యులను ఎన్నుకోవాలి. 1.30 గంటలకు చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. 2 గంటలకు వారితో ప్రమాణస్వీకారం చేయించాలి. 3.30 గంటల్లోపు తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలి.

వైసీపీ హయాంలో అస్తవ్యస్తం..

గతంలో తల్లిదండ్రుల కమిటీ పేరిట వైసీపీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించేది. ఇందులో రాజకీయ జోక్యం అధికంగా ఉండేది. ఎన్నికల సందర్భంగా చాలాచోట్ల విధ్వంసాలు జరిగాయి. అప్పట్లో నాడు-నేడు పథకంలో పాఠశాలల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టింది. ఈ పనులు చేపట్టడంలో తల్లిదండ్రుల కమిటీలదే కీలక పాత్ర. అయితే అప్పట్లో టీడీపీ ఓడిపోవడంతో ఆ పార్టీ నాయకులు తల్లిదండ్రుల కమిటీల విషయంలో పెద్దగా ఆసక్తి చూపలేదు. వైసీపీ వర్గాల మధ్య పెద్ద గొడవలే జరిగాయి. కమిటీలను కైవసం చేసుకునేందుకు పోటాపోటీగా తలపడడంతో విధ్వంస ఘటనలు కూడా జరిగాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఎస్ఎంసీలను దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఆరేళ్ల మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, నాలుగేళ్ల బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 440 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ:** మేథమెటికల్ సైన్స్ 40, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 20, బయాలజీ 60, అప్లయిడ్ జియాలజీ 18, సైకాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- **ఇంటిగ్రేటెడ్ ఎంఏ:** తెలుగు 19, హిందీ 20, లాంగ్వేజ్ సైన్సెస్ 19, ఉర్దూ 14, ఎకనామిక్స్ 17, హిస్టరీ 35, పొలిటికల్ సైన్స్ 25, సోషియాలజీ 25, ఆంత్రోపాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీలో 28 సీట్లు ఉన్నాయి.
- బీఎస్ ఆనర్స్/రీసెర్చ్: కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంఏలో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు మాత్రం ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. లేదంటే ఓరియంటల్ ఎగ్జామినేషన్(తెలుగు/హిందీ/ఉర్దూ) ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు స్పెషలైజేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు పదోతరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగు చదివుండాలి. బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌నకు కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థులందరికీ ఇంటర్ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 22
- **ఫిజికల్ రిపోర్టింగ్, అడ్మిషన్ కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 30, 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/z94oKavలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ, ఎంసీఏ

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)-స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఐసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో తొమ్మిది సీట్లు ఉన్నాయి. ఎంసీఏ ప్రోగ్రామ్‌ను కాకినాడలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈకే)లో, ఎంబీఏ ప్రోగ్రామ్‌ను జేఎన్‌టీయూకేకు చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం డిగ్రీ/ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. రెండు ప్రోగ్రామ్‌లకూ ఐసెట్ 2024 అర్హత తప్పనిసరి. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ప్రభుత్వ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

896 ఖాళీలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్).. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-గీఐగి) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు దశల ఎంపిక విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

1. ఐటీ ఆఫీసర్(స్కేల్-1): **170 పోస్టులు**
2. అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): **346**
3. రాజ్‌భాష అధికారి(స్కేల్-1): **25**
4. లా ఆఫీసర్ స్కేల్-1): **125**
5. హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): **25**
6. మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్-1): **205**

అర్హతలు: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్). డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫిషరీ సైన్స్/పిసికల్చర్/అగ్రి.మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్/ఆగ్రో ఫారెస్ట్రీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/ఫుడ్ సైన్స్/అగ్రికల్చర్ టెక్నాలజీ బిజినెస్ మేనేజ్‌మెంట్/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/సెరికల్చర్/ఫిషరీస్ ఇంజనీరింగ్). పీజీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్). పీజీ(హిందీ/సంస్కృతం). డిగ్రీ(ఎల్ఎల్‌బీ), పీజీ డిప్లొమా(పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/లేబర్ లా). ఎంఎంఎస్(మార్కెటింగ్)/ఎంబీఏ(మార్కెటింగ్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/పీజీపీఎం/పీజీడీఎం.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://www.ibps.in/

నవ్య | చిత్రజ్యోతి

చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సర్!



హీరోయిన్ కీర్తిసురేశ్ వివాదంలో చిక్కుకున్నారు. తను నటించిన 'రఘు తాత' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దక్షిణాదిన బెస్ట్ డాన్సర్స్ గురించి ప్రస్తావన తెచ్చిన యాంకర్ 'మీ దృష్టిలో బెస్ట్ డాన్సర్ ఎవరు?' అని కీర్తిని అడిగారు. చిరంజీవి, తమిళ హీరో విజయ్ పేర్లు సూచించి, ఆ ఇద్దరిలో ఎవరి డాన్స్ అంటే మీకిష్టం అని అడిగారు. కీర్తిసురేశ్ విజయ్ పేరును ఎంచుకున్నారు. దీనిపై కీర్తిని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఏ విధంగా చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సరో చెప్పాలని ఆమెను ప్రశ్నిస్తున్నారు. నానీ కన్నా ధనుష్, ధనుష్ కన్నా అల్లు అర్జున్ బాగా డాన్స్ చేస్తారని ఆమె చెప్పారు. అలాగే అల్లు అర్జున్ కన్నా చిరంజీవి డాన్స్‌ను ఎక్కువ ఇష్టపడతాను అని కీర్తి తెలిపారు.



విభిన్నమైన లుక్‌లో విజయ్



'రౌడీ' అంటూ అభిమానులు ఆప్యాయంగా పిలుచుకునే హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 12వ చిత్రం శరవేగంతో తయారవుతోంది. 'మళ్లీ రావా','జెర్సీ' చిత్రాల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాలో విభిన్న గెటప్‌లో కనిపిస్తున్న విజయ్ దేవరకొండ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం ఇటీవల శ్రీలంకలోని అందమైన ప్రదేశాల్లో జరిగిన షూటింగ్‌తో అరవై శాతం చిత్రం పూర్తయింది. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ నెల్లోనే ఆవిష్కరిస్తామనీ, వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.

దేవరతో స్టెప్పులేసిన జాన్వీ

జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'దేవర' చిత్రం కోసం ఇటీవల చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నారు. జాన్వీతో ఎన్టీఆర్ రొమాంటిక్ మోడ్‌లో ఉన్న పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జాన్వీ అందాలు కనువిందు చేస్తున్నాయి. 'పఠాన్', వార్, 'ఫైటర్' చిత్రాలలో వైరల్ స్టెప్స్‌కు పేరు పొందిన బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిన్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించడం విశేషం. ఎన్టీఆర్ అసాధారణమైన స్టెప్స్‌తో ఈ సాంగ్ అందరినీ అలరిస్తుందని దర్శకుడు కొరటాల శివ చెప్పారు. సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'దేవర పార్ట్ 1' ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ చెప్పారు. కల్యాణ్‌రామ్ చిత్ర సమర్పకుడు.

కొత్తగా..

వేణు ఊడుగుల నిర్మాణంలో...

తరుణ్ భాస్కర్ హీరోగా



నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకుడు వేణు ఊడుగుల, బూసం జగన్‌మోహన్‌రెడ్డితో కలసి నిర్మిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం, అక్టోబర్ 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు.

నిర్మాణరంగంలోకి ముత్యాల సుబ్బయ్య



కుటుంబ ఇతివృత్తాలతో అద్భుత చిత్రాలను అందించి, అగ్ర హీరోలందరితోనూ పని చేసిన సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. తన సమర్పణలో తనయుడు ముత్యాల అనంతకిశోర్ నిర్మాతగా ఓ సినిమా నిర్మించనున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓ వైవిధ్య భరితమైన కథాంశంతో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. ఈ నెల 9న అన్నపూర్ణ స్టూడియోలో చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు.



ఇదేం షూటింగ్ కాదు


- హీరో విశాల్‌కు హైకోర్టు మందలింపు



హీరో విశాల్‌ను మద్రాస్ హైకోర్టు మందలించింది. అడిగిన దానికి సరిగ్గా సమాధానం ఇవ్వాలని, ఏదో ఒకటి చెప్పడానికి ఇదేమీ షూటింగ్ కాదంటూ కటువుగా వ్యాఖ్యానించింది. లైకా ప్రొడక్షన్స్ నుంచి హీరో విశాల్ తీసుకున్న రూ.21.29 కోట్ల రుణం కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో కొంతకాలంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ గురువారం న్యాయమూర్తి పీటీ ఆషా సమక్షంలో జరిగింది. ఈ విచారణకు విశాల్ నేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ తరపు న్యాయవాది కొన్ని పత్రాలు చూపించి, అవి విశాల్ సంతకం చేసినవేనని పేర్కొన్నారు. ఇందుకు విశాల్ సమాధానమిస్తూ.. ఆ ఒప్పందం గురించి తనకేమీ తెలియదని, తన వద్ద కేవలం తెల్లకాగితంపై సంతకం తీసుకున్నారని చెప్పారు. దీంతో ఆగ్రహించిన న్యాయమూర్తి.. 'మీరు చేసిన సంతకాన్ని ఎలా కాదని చెబుతారు? చాలా తెలివిగా సమాధానం చెబుతున్నట్టు అనుకోవద్దు. ఇది షూటింగ్ కాదు. జాగ్రత్తగా సమాధానాలు చెప్పండి' అని మందలించారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డేట్ మారింది



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుఫాన్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కావాలి. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడిందనీ, ఈ నెల తొమ్మిదిన రిలీజ్ చేస్తున్నామనీ నిర్మాతలు కమల్ బోరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా చెప్పారు. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సిరి సాయిసినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది.

బ్రిట్నీ స్పియర్స్ బయోపిక్



హాలీవుడ్ నటి, పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవిత గాథ త్వరలోనే వెండితెరపైకి రానుంది. నిర్మాణసంస్థ యూనివర్శల్ పిక్చర్స్, బ్రిట్నీ స్పియర్స్ సోషల్ మీడియా ద్వారా శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. 'నాకు ఇష్టమైన చిత్రాలను నిర్మించిన మార్క్ ప్లాట్‌తో ఒక సీక్రెట్ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నాను. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది' అని బ్రిట్నీ పేర్కొన్నారు. బ్రిట్నీ స్వీయ రచన 'ది ఉమెన్ ఇన్ మీ' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. జోన్ ఎం. చూ దర్శకత్వంలో మార్క్ ప్లాట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బ్రిట్నీ బాల్యం నుంచి స్టార్‌గా ఎదిగేవరకూ ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును ఆవిష్కరించనున్నారు.





తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం దాసన్నపేట: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కోచ్, మేనేజంగా గగన్‌సాగర్ దొర, చైతన్య, రిఫరీగా దీపిక వ్యవహరించనున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురానఅయ్యలు, వేణుగోపాలరావు అభినందించారు.

మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా చూడండి: డీఎంహెచ్‌వో

విజయనగరం రూరల్: మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు చెప్పారు. శుక్రవారం రాకోడు పీహెచ్‌సీ పరిధిలోని దుప్పాడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న కుండీలు, డ్రమ్ములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని, నీరు ఎక్కువగా నిల్వ ఉన్న కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. రాకోడు పీ హెచ్‌సీ వైద్యురాలు అఖిల, సిబ్బంది మాణిక్యం, రాముడమ్మ, శ్రీను, కృష్ణ, స్వాతి, రత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4 జీ సేవలు

విజయనగరం టౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లాల పరిధిలో భారతీయ సంచార నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 4 జీ టెక్నాలజీని దశలవారీగా ప్రవేశపెడుతున్నామని జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజరు దాలినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు 2జీ, 3 జీ సిమ్‌కార్డును తక్షణమే అప్‌గ్రేడ్ చేసుకోవాలని తెలిపారు. 4జీ అప్‌గ్రేడ్ చేసినా, 2జీ, 3 జీ సేవలు కొనసాగుతాయని తెలిపారు. 2జీ, 3జీ సిమ్ వినియోగిస్తున్న వినియోగదారులు కైవైసీ పూర్తి చేయాలని వచ్చిన సందేశాన్ని అంతరాయం లేకుండా 4 జీ సేవలను ఆస్వాదించడానికి తమ దగ్గరలో వున్న బీఎస్ఎన్ఎల్ కస్టమర్స్ సర్వీస్ సెంటర్, ఫ్రాంచైజీ, రిటైలర్లు, ఏజెంట్లను సంప్రదించాలని కోరారు.

వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలి

రాజాం: వీఆర్వోలు, వీఆర్యేలు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్యేలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఆక్రమణలపై సమాచారం అందించాలని, అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వాటర్ ప్లాంట్లను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని.. వాటిపై దాడులు చేసి మూసివేయిస్తున్నామని తెలిపారు. ఎవరైనా రాత్రి సమయల్లో వాటర్ బాటిల్స్ తరలిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రకాష్, ఆర్ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి కాంట్రాక్టు కార్మికులు

కొత్తవలస: అవసరాన్ని బట్టి కాంట్రాక్టు కార్మికులను జేఎస్ఎల్ కర్మాగార యాజమాన్యం పనిలోకి తీసుకుంటోంది. లాకౌట్ ఎత్తివేసి గురువారం నుంచి తెరచిన కర్మాగారంలో నిర్వహణా పనులను యాజమాన్యం చేయిస్తోంది. 47 మంది ఎంప్లాయిస్, కార్మికులతో పాటు సుమారు 50 మంది కాంట్రాక్టు కార్మికులను కూడా పనిలోకి తీసుకుంది. దశలవారీగా అవసరాన్ని బట్టి కాంట్రాక్టు కార్మికులను సైతం పనిలోకి తీసుకుని పని కల్పిస్తామని యాజమాన్యం తెలిపింది. సుమారు మూడు నెలలు పాటు నిర్వహణా పనులు జరిగే అవకాశం ఉందని, నిర్వహణా పనులు పూర్తయిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరికీ పని కల్పించనున్నట్టు తెలిపింది.

కౌలు కార్డుల పంపిణీపై సమీక్ష

బొబ్బిలి రూరల్: మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందితో కౌలు రైతుల కార్డులపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 963 కార్డులు మాత్రమే జారీ చేశారని, మిగిలిన కార్డులు 10 రోజుల్లో ఇవ్వాలని తహసీల్దారు ఆదేశించారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోండి

బొబ్బిలి రూరల్: స్థానిక ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో ఐఈఆర్‌ఈపీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం 11 మందికి డాక్టర్ బి.శ్రీకాంత్ ఫిజియోథెరపీ సేవలు అందించారు. ప్రతి శుక్రవారం దివ్యాంగులు ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఐఈఆర్‌పీ రవి, దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో మొక్కల తొలగింపు

వంగర: మగ్గూరులో వర్షం నీటితో పాటు మడ్డువలస కాలువ నీరు పంటపొలాల్లోకి చేరి రైతులకు నష్టం జరుగుతుంది. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనువాసరావు చొరవ తీసుకుని పంటపొలాలనీరు బయటకు పోవటానికి ఏర్పాటు చేసిన కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించటానికి సిద్ధమయ్యారు. గ్రామస్థులు, రైతులతో కలిసి శ్రమదానం చేయగా, కొంత మంది దినసరి కూలీలు వచ్చి కాలువల్లో మొక్కలు తొలగించారు.

జనసేన కార్యకర్తలకు బీమా

రేగిడి: జనసేన కార్యకర్తలకు రూ.5 లక్షల బీమా ఇవ్వడం ఒక వరమని ఆ పార్టీ మండల నేతలు బలసా శ్యాంసుందరరావు, గొర్లె గోవిందరావు, మీసాల రాంబాబులు పేర్కొన్నారు. ఉంగరాడమెట్ట వద్ద శుక్రవారం రెండో రోజు జనసేన నేతలు సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. కొంతమందికి సభ్యత్వాలు ఇచ్చారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాలు, ప్రజలకు చేస్తున్న సేవను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పుప్పల కాశీకృష్ణ, గొల్లపల్లి చక్రధర్, పల్లా రాము, సిరిపురపు శివ, పతివాడ శ్రీకుమార్ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

బొబ్బిలి రూరల్: పిరిడి గ్రామంలోని ఎం.పి.పి. పాఠశాలను ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి.. నాణ్యత పాటించాలని సూచించారు.

ఉత్సాహంగా ఆరోగ్య బాలల పోటీలు

విజయనగరం రూరల్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆరోగ్య బాలల పోటీలు, ఫ్యాషన్ వాక్ ఫర్ ప్రెగ్నెంట్ ఉమెన్ తదితర పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గైనకాలజిస్టులు డాక్టరు శాంతి, డాక్టరు నాగమల్లి, డాక్టరు విచిత్ర వ్యవహరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లేడీస్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.శిరీష, కల్పనా కుక్రేజా, జిల్లా చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్, ప్రతినిధులు ఉమా బాలాజీ, బి.విశాలి, అనితా బోత్రా, వి.రాధిక, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు ఏర్పాటుచేయండి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో అత్యవసర వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ కోరారు. శుక్రవారం తహసీల్దార్ అరుణ కుమారికి వినతిపత్రం అందించారు.

రికార్డులకు పటిష్ఠ భద్రత కల్పించాలి

● కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 2: జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రికార్డులకు పటిష్ఠ భద్రత కల్పించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రిజిస్ట్రార్, అగ్నిమాపక అధికారి, తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అగ్ని ప్రమాదాల జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళ వాచ్‌మన్‌లను నియమించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారి, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ లక్ష్మణరావు, అసిస్టెంట్ ఫైర్ అధికారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఉద్యోగులపై సర్వే చేపట్టండి

జిల్లాలోని పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో స్థానికులు ఎంతమంది ఉన్నారో వారం రోజుల్లో సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం తన చాం బర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 196 కర్మాగారాల్లో ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. పరిశ్రమల్లో ఉద్యోగాలు 75 శాతం స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన ఎంత వరకు అమలు జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. ఈ నివేదికను సుప్రీం కోర్టుకు అందజేయాల్సి ఉన్నందున వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.అరుణ, ఇండస్ట్రీస్ జాయింట్ డైరక్టర్ సీహెచ్ గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తదితరులు పాల్గొన్నారు.

చదువును కొనసాగించాలి

ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా చూడాలని కలెక్టర్ కోరారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఎటువంటి విద్యార్హతలు లేనివారు, చదువును మధ్యలో వదిలేసిన వారు నేరుగా పదోతరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఒక చక్కని మార్గమని అన్నారు. ఈ నెల 31 నాటికి 14 ఏళ్లు నిండినవారంతా పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. ఈనెల 27లోగా తమ పేర్లను ఆన్‌లైన్ లేదా ఎంఈవో కార్యాలయాల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పదోతరగతి పరీక్షకు హాజరయ్యేవారు ఫీజు రూ.100, ఇంటర్ పరీక్షకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో ప్రేమకుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, ఆర్ఐవో ఆదినారాయణ, డీవీఈవో భీమా శంకర్, అసిస్టెంట్ కంట్రోలర్ తిరుమలరాజు సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై భగ్గుమన్న స్థానికులు

● అధికారుల తీరుపై ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయించి నిరసన

● ఎమ్మెల్యే బేబీనాయన హామీతో ఆందోళన విరమణ


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్థానికులు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని అమ్మిగారి కోనేరుగట్టు వీధిలో జయప్రకాశ్ మున్సిపల్ స్కూలు దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 ఏళ్ల మణికంఠ దుర్మరణం పాలైన ఘటనపై స్థానికుల ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. శుక్రవారం వేకువజాము నుంచి జయప్రకాశ్ స్కూలు రోడ్డుపై బైఠాయించి, పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రమాదాలకు కారణమవుతూ నిండు ప్రాణాలను బలిగొంటున్న రోడ్లను తక్షణం బాగు చేయించాలని, భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని డిమాండ్ చేశారు. స్కూలు జోన్ బోర్డులు పెట్టి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, పార్వతీపురం నుంచి వచ్చే భారీ కంటైనర్లు, ఇతర భారీ వాహనాలను దారి మళ్లించాలని డిమాండ్ చేశారు.

ఈ శోకం ఏ తల్లిదండ్రులకూ వద్దు

'కళ్లెదుటే లారీ కిందపడి మణికంఠ దుర్మరణంతో మాకు కడుపు కోత మిగిలింది. ఇలాంటి గర్భశోకం ఏ తల్లిదండ్రులకూ రాకూడదు. చాలా ఏళ్ల నుంచి రోడ్లు బాగా లేవని.. మరమ్మతులు చేయండి అని గగ్గోలు పెట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పుడొచ్చి ఏవేవో చెబుతున్నారు. మా పిల్లాడి ప్రాణాలను తిరిగి ఇవ్వగలరా?' అని మృతుని తల్లిదండ్రులు, తాతయ్య నిలదీస్తుంటే స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు. ఆందోళన చేస్తున్న వారి దగ్గరకు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు వచ్చి ఎంతగా నచ్చజెప్పినప్పటికీ వారి మాట వినకుండా ఆందోళన కొనసాగించారు. ఎమ్మెల్యే బేబీనాయన వచ్చి హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని పట్టుబట్టారు. కౌన్సిలర్ శరత్‌బాబు సూచనతో ఘటనా స్థలానికి వచ్చిన బేబీనాయన స్థానికుల డిమాండ్లను ఆలకించారు. ట్రాఫిక్ మళ్లింపు, ఇతర సమస్యలపై కలెక్టర్ అంబేడ్కర్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వాహనాలన్నిటినీ పాలకొండ-వీరఘట్టం రోడ్డులో మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇద్దరు ఎంఈవోలను రప్పించి స్కూలు జోన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని బేబీనాయన ఆదేశించారు. మృతి చెందిన మణికంఠ కుటుంబాన్ని ఆదుకునేందుకు అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళనను విరమించారు.

ప్రతి కౌలు రైతుకూ రుణం అందాలి: జేసీ


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్: పొలంలోని పంట వేసిన ప్రతి కౌలు రైతుకు బ్యాంక్ నుంచి పంట రుణం అందాలని జేసీ కార్తీక్ తెలి పారు. రూ.70 కోట్ల రుణాలను కౌలు రైతులకు ఈ ఏడాది అందించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 13 వేలు సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు ఇవ్వడం జరిగిందని, మండల వారీగా ఆ జాబితాలను బ్యాంకు అధికారులకు పంపించామన్నారు. భూయజమాని రుణం తీసుకోవడం వల్ల కౌలుదారులకు రుణాలు ఇవ్వలేకపోతున్నామని కొంతమంది బ్యాంకర్లు జేసీ దృష్టికి తెచ్చారు. పంట వేసిన వారికే పంట రుణం పొందే అర్హత ఉంటుందని, కౌలు రైతులందరికీ రుణం వచ్చేలా చూడాలన్నారు. బ్యాంకు, వ్యవసాయ అధికారులు కలిసి గ్రామాల్లో రైతుల వద్దకే వెళ్ళి, రుణ దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు. సీసీఆర్ కార్డులు ఉన్న రైతులంతా అర్హులేనని వారిపై ఎలాంటి అనుమానాలకు తావు లేదని వారికి పంట రుణాలు అందజేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు, ఎల్‌డీఎం వీవీఆర్ మూర్తి తదితరులు ఉన్నారు.

ఒడిసాలో బొల్లినేని మెడిస్కిల్స్


ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఒడిసా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఆ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజ న్ ప్రదాన్ సమక్షంలో అధికారులతో ఎంఓ యూ కుదురిందన్నారు. గజపతి జిల్లా ఉపాధి కల్పనాధికారి సౌభాగ్య ఎస్ఆర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి


కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న విజయకల్యాణి

కొత్తవలస: దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని విజయనగరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.విజయకల్యాణి అన్నారు. శుక్రవారం మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆమె సందర్శించారు. విర్కో ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది దివ్యాంగులు చక్కని ప్రతిభ కనబరుస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా గత 24 సంవత్సరాల నుంచి సేవలు అందించడం విశేషమన్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్స్, ఇతరత్రా న్యాయపరమైన సేవల్లో ఇబ్బందులు ఉంటే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి దరఖాస్తు చేసుకుంటే తక్షణ సాయం అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవయవ తయారీ కేంద్రాన్ని, గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. 175 మంది దివ్యాంగులకు కృత్రిమ ఉపకరణాలు, వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో విర్కో ఫౌండేషన్ చైర్మన్ టి.ప్రవీణ, ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, వైస్‌చైర్మన్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతోనే లక్ష్యాల సాధన

● ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గిరిజా శంకర్



మాట్లాడుతున్న గిరిజా శంకర్

విజయనగరం టౌన్: విద్యార్థులు నిజాయితీ, నిబద్ధతతో శ్రమించి.. అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ గిరిజా శంకర్ అన్నారు. విజయనగరం మహారాజా ఫార్మసీ కళాశాల 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెడు మార్గాల వైపు మళ్లితే లక్ష్యాలను చేరుకోలేరని తెలిపారు. అనంతరం ఈ ఏడాది మెరిట్ సాధించిన విద్యార్థులకు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, ఫైజర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ గ్రూప్ మేనేజర్ కె.అనిల్, కరస్పాండెంట్ కేవీఎల్ రాజు, ప్రిన్సిపాల్ పి.ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్లు తెరిస్తే క్రిమినల్ కేసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● తహసీల్దార్ కృష్ణంరాజు

రాజాం రూరల్: సీజ్ చేసిన వాటర్ ప్లాంట్లను అనధికారికంగా తెరిచినా, పట్టణంలో కేన్లు ద్వారా నీటిని సరఫరా చేసినా జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజాం తహసీల్దార్ కృష్ణంరాజు హెచ్చరించారు. 'తహసీల్దార్ సీజ్ చేసినా..' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ తీవ్రంగా స్పందించారు. పట్టణంలోని కొన్ని వాటర్ ప్లాంట్లను ఆయన స్వయంగా పరిశీలించి యజమానులను హెచ్చరించారు. నిర్దేశిత నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతితో మాత్రమే ప్లాంట్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. గతనెల 23న తాను సీజ్ చేస్తే తిరిగి ఎవరి అనుమతితో తెరిచారని ప్లాంట్ల యజమానులను ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతలేని నీటిని ప్రజలు తాగి రోగాలబారిన పడితే ఎవరు బాధ్యులని పేర్కొన్నారు. వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని, వాటర్‌ప్లాంట్లు తెరిసే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం


మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో బాధితులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులు, బాధితులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం అందించనున్నట్టు తెలిపారు. బాధితులు వెంటనే క్లెయిమ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు కె.హేమలత, వి.వి.రమణ, చినమేరంగి సీఐ బి.మంగరాజు, పార్వతీపురం టౌన్ ఎస్ఐ కె.ప్రయోగమూర్తి, పార్వతీపురం టౌన్ ఎస్ఐ బి.సంతోషి పాల్గొన్నారు.

కుమరాం పంచాయతీ రికార్డులు సీజ్

● నిధుల దుర్వినియోగంపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో మోహనరావు

జామి: కుమరాం పంచాయతీలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయని, ఈ విషయంపై గ్రామస్థులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారని 'ఆంధ్రజ్యోతి' కొద్దిరోజుల క్రితం ప్రచురించింది. శుక్రవారం దీనిపై జిల్లా పంచాయతీ అధికారి మోహనరావు గ్రామ సచివాలయంలో ఫిర్యాదుదారులు, గ్రామకార్యదర్శి కృష్ణ తదితరులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మట్లాడుతూ పంచాయతీ నిధుల నుంచి వీధి లైట్ల కొనుగోలు, బ్లీచింగ్, ఫినాయిల్ కొనుగోళ్లు, శానిటేషన్ పనుల నిర్వహణలో నిధులు దుర్వినియోగమయ్యాయని తెలిపారు. పారిశుధ్యం మెరుగు పేరుతో నిధులు పెద్దఎత్తున దుర్వినియోగమయ్యాయన్నారు. ఈ విషయాలపై తాము అనేకసార్లు సమాచార హక్కు ద్వారా వివరాలు కోరినా ఇవ్వలేదని తెలిపారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ ఈ విషయాలపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తామని, అక్రమాలు నిజమైతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం ఈఓపీఆర్‌డీ శ్రీదేవి పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకొని జిల్లా కార్యాలయానికి తరలించారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ముప్పన్నెల జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. రామభద్రపురం, పాలకొండ, బొబ్బిలి, రాజాంతో పాటు పలు చోట్ల ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.


రామభద్రపురంలో..


పాలకొండలో..


రాజాంలో..

బావిలో పడి వ్యక్తి మృతి

రేగిడి: బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి సివిల్‌సప్లయ్ గొడౌన్‌లో ఆమదాలవలస గ్రామానికి చెందిన కుమిలి రాంబాబు(35) కళాసీగా పనిచేస్తున్నాడు. ఈయనకు నాలుగేళ్ల క్రితం చిన్నశిర్లాం గ్రామానికి చెందిన సంతుతో వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప పూజిత ఉంది. ఇటీవల అత్తవారి ఊర్లో వారాలు కాగా భార్యను పంపించి తాను వెళ్లలేకపోయాడు. దీంతో భార్యను చూసేందుకు శుక్రవారం ఉదయం చిన్నశిర్లాంలోని అత్తవారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి శుక్రవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న బావిలో పడిపోయి ఉన్నట్టు గ్రామస్థులు గుర్తించారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే ఈ ఘటనపై ప్రమాదమా లేదా ఆత్మహత్యా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఎస్ఐ శ్రీనివాస్ మాత్రం ఈయన మద్యం మత్తులో ఉన్నట్లు, స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి ఉండవచ్చుని ప్రాథమిక సమాచారంగా చెప్పారు. కుటుంబీకుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం రాజాం పంపించినట్లు తెలిపారు.

రామభద్రపురంలో భారీ చోరీ

● 25 తులాల బంగారం, అరకేజీ వెండి అపహరణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం ఎస్ఐ మురళీమోహన్

రామభద్రపురం, ఆగస్టు 2: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. స్థానికంగా వ్యాపారం చేస్తున్న పప్పు ఈశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఇదే అదునుగా చూసిన దొంగలు ఈ చోరీకి ప్లాన్ వేశారు. ఇంటిలోని బీరువాలో ఉన్న సుమారు 25 తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించినట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. దీనిపై సమీప బంధువు పప్పు రాంబాబు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాన్ని విజయనగరం క్లూస్ టీం పరిశీలించారు. క్లూస్‌టీం ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో వేలిముద్రల నమూనాలు సేకరించారు. బాడంగి ఎస్ఐ జయంతి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దీనిపై ఏఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దొంగతనం జరగడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లక్కవరపుకోట: మండలంలోని విశాఖ-అరుకు రోడ్డు మార్గంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం ముషిడిపల్లికి చెందిన గుంటు లక్ష్మణరావు(69) రంగారాయపురంలోని బంధువుల ఇంటికి గురువారం వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రంగారాయపురం నుంచి ఎల్.కోట వైపు నడుచుకుంటూ వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతనిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు. జరిగిన ఘటనకు కారకుడైన ఎం.అప్పలరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిపై దాడి

సంతకవిటి: మండలం కొత్తూరు రామచంద్రపురం గ్రామానికి చెందిన కాలయ ఎల్లమ్మ అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన తేగల రాము అనే వ్యక్తి శుక్రవారం మద్యం మత్తులో దాడి చేశాడు. దీంతో వృద్ధురాలి గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. దీంతో స్థానికులు ఆమెను రిమ్స్‌కు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతోంది. దీనిపై బాధితురాలి సోదరుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వాసుదేశరావు తెలిపారు.

సచివాలయంలో చోరీ

రేగిడి: మండలం తోకలవలస సచివాలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి వలంటీర్లకు సంబంధించిన రెండు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. దీనిపై సెక్రటరీ రాకేష్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో పాటు వెళ్లి శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న బీరువా తాళాలు పగలుగొట్టగా, డబ్బులేవీ లేకపోవడంతో సెల్‌ఫోన్లు మాత్రమే అపహరించారని ఎస్ఐ తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మరో రెండు డయేరియా కేసులు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని గిరిశిఖర గ్రామాలైన పొర్లు, కురిడి నుంచి రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరు కూడా సదరు స్వచ్ఛంద సంస్థలో భోజనాలు చేసి అక్కడే పాఠశాలలకు వెళ్తున్నారని, చిట్టెంపాడు విద్యార్థుల తోపాటు తమ పిల్లలను తీసుకొచ్చినట్లు పిల్లల తండ్రులు తెలిపారు. సీహెచ్‌సీలో చేర్చిన వారిలో సంతోష్(7), లావణ్య (11) ఉన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పింఛన్లలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్లలో అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో వాస్తవమని వెల్లడి కావడంతో పాచిపెంట మండలం కేసలి పంచాయతీ గ్రేడ్-4 కార్యదర్శి సేనాపతి సునీత, గ్రేడ్-5 గ్రామ కార్యదర్శి కోలక వాసులను సస్పెండ్ చేశారు. రెండు సంవత్సరాల కిందట మరణించిన వ్యక్తి పేరుతో పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు ధ్రువీకరణ కావడంతో సస్పెండ్ చేశారు.

రెండు క్వారీలు సీజ్


నిలిచిన లారీలు

భోగాపురం: కొంగవానిపాలెం రెవెన్యూ రామచంద్రపేట పంచాయతీ పరిధిలో ఉన్న రెండు క్వారీలను ఆర్డీవో సూర్యకళ, మైన్స్ అధికారి ఎన్.చల్లాలు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రామచంద్రపేట పంచా యతీలో సుమారు ఏడు ఎకరాల్లోగల డీపట్టా భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా విశ్వంభర కనస్ట్రక్షన్స్, కోటిపాటిపర్స్ అను రెండు క్వారీల్లో స్టోన్ కనస్ట్రక్షన్ పాయింట్, కార్యాలయ భవనం అక్రమంగా నిర్వహిస్తున్నారని అధికారులు గుర్తించి, దీనికి సంబంధించి గ్రామస్థుల సమక్షంలో రిపోర్ట్ తయారు చేశారు. అనంతరం రెండు క్వారీల నిర్వహణకు సంబంధించిన గదులను సీజ్ చేశారు. దీనిపై తహసీల్దార్ ఎం.సురేష్‌ను వివరణ కోరగా అక్రమంగా క్వారీలు నిర్వహించ డంతో వాటిని సీజ్ చేశామని చెప్పారు. క్వారీలను సీజ్ చేయడంతో లారీలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ హరీష్, ఆర్ఐ కిశోర్, వీఆర్వో ఉష, గ్రామ నాయకులు కోలా రామసూరి, దుక్క రమణ, దుక్క అప్పన్న, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో యువకుడి మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో శుక్రవారం రైతు టి.పోలినాయుడు కుమారుడు, టి.సుధీర్ (27) పాము కాటుకి గురై మృతి చెందాడు. సుధీర్ ఉదయం పొలంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా దారిలో పాము కరిచినట్ల యిందని తండ్రికి తెలిపాడు. అంతలోనె స్పృహ కోల్పోయాడు. వెంటనే సుధీర్‌ను బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పో యాడని వైద్యులు తెలిపారు. విషయం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి పంపించారు.

అక్రమ కలప స్వాధీనం


ఫారెస్టు అధికారులు పట్టుకున్న కలప

కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలం నుంచి పాలకొండకు అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఈసందర్భంగా కురుపాం ఫారెస్టు రేంజ్ అధికారి మణికంఠేశ్వరావు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం మండ లం కొండవాడ గ్రామం నుంచి ఓ రైతు మూడు టేకు చెట్ల దుంగలను పాల కొండకు తరులిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి, కురుపాం ఫారెస్టు కార్యాల యానికి తరలించినట్టు తెలిపారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయాలు ఉం టుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఫారెస్టు సెక్షన్ అధికారి సూర్యప్రకాష్, అటవీ శాఖ బీట్ అధికారులు, అసిస్టెంట్ బీట్ అధికారులు పాల్గొన్నారు.

అనధికార వసతిగృహం పరిశీలన



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, తదితరులు

గంట్యాడ: మండలంలోని కరకవలస గ్రామ పరిధిలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాన్ని డీఈవో ప్రేమ్ కుమార్, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి తదితరులు శుక్రవారం పరిశీలించారు. వసతి గృహ నిర్వహణ, విద్యార్థుల సంఖ్య, అనుమతులపై ఆరా తీశారు. ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. అలాగే ఇక్కడ ఉన్న బాలికలకు ఎటువంటి రక్షణ లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వంటి విషయాలను గ్రహించారు. ఈ వసతిగృహంలో పలువురు విద్యార్థులు డయేరియా బారిన పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత వారిని దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పిస్తామని డీఈవో తెలిపారు. విద్యార్థుల అందరి ఆరోగ్యం బాగానే ఉందని, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆర్జేడీ పరిశీలించారని చెప్పారు. ఇక్కడ నిర్వహిస్తున్న వసతి గృహం నిబంధనలకు విరుద్ధంగా ఉందని గతంలో చెప్పామని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. తమ ఆదేశాలను పట్టించుకోలేదన్నారు. దీనిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బాలలు సంక్షేమ సమితి అధ్యక్షురాలు హిమబిందు, ఎంఈవో విజయకుమారి, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి యాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ

శృంగవరపుకోట రూరల్: గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు చెందిన 20మంది విద్యార్థులు డయేరియాతో ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం పరామర్శించారు. ఘటనకు గల కారణాలను వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కూడా విద్యార్థులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆండ్ర' నీరు విడుదల

మెంటాడ: మండలంలోని ఆండ్ర జలాశయం నుంచి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం నీటిని విడుదల చేయనున్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాలకు చెందిన సుమారు తొమ్మిది వేల ఎకరాలకు ఆండ్ర జలాశయం నీరు అందిస్తుంది. ఇప్పటికే నీరు విడుదల చేయాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల జాప్యం జరిగింది. వరినారు ముదిరిపోతున్న నేపథ్యంలో దీని ప్రభావం దిగుబడిపై చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో కుడి, ఎడమ కాలువల ద్వారా 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రి చేతులమీదగా నీటిని విడుదల చేయనున్నట్టు ఇరిగేషన్ డీఈఈ పాండు శుక్రవారం తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు తూడెం విద్యార్థులు

భోగాపురం: మండలంలోని తూడెం ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వి.అప్పన్న తెలిపారు. గత నెల 10, 27 తేదీల్లో బొబ్బిలి మండలం పారాది జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యు.లోకేశ్వరి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వినుకొండలో నిర్వహించనున్నారు. అలాగే జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కె.ఇందు, సీహెచ్ సాత్విక్, దుర్గాప్రసాదు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 17 నుంచి 19 వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్నారు. ఈ విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ సత్యనారాయణను ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నెల్లిమర్ల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయిరామ్, అనిల్‌కుమార్ సూచించారు. సతివాడలోని ఆదర్శ పాఠశాలను వారు శుక్రవారం పరిశీలించారు. బాలికల హాస్టల్ వంటగది, డైనింగ్ రూమ్, విశ్రాంతి గదులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కౌమారదశలో బాలికలు రుతుస్రావం వల్ల రక్తహీనత వంటి సమస్యలను ఎదుర్కొంటారని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మిసెస్ ఇండియాకు కళా అభినందన



చీపురుపల్లి: మిసెస్ ఇండియాగా ఎంపికైన వెలిచేటి రమాచౌదరిని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు శుక్రవారం అభినందించారు. మండలంలోని చిననడిపల్లి గ్రామానికి చెందిన రమా చౌదరి ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన పోటీల్లో ఈ విజయం సాధించారు. ఫెమా సంస్థ నిర్వహించిన పోటీల్లో ఆమె రెండో స్థానంలో నిలిచారు. చీపురుపల్లి ప్రాంతానికి చెందిన మహిళకు ఈ అరుదైన అవార్డు రావడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

వాసవీమాతకు సారె

జామి: జామిలోని వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారికి శుక్రవారం గ్రామ ఆర్య వైశ్య మహిళలు వివిధ రకాల సారెను సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.



వాసవీమాతకు సారె సమర్పిస్తున్న దృశ్యం

108 శివలింగాలకు ప్రత్యేక పూజలు



108 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలో ఉన్న 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను శుక్రవారం నిర్వహించారు. సదనం వ్యవస్థాపకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సదనం అర్చకుడు కిరణ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ

జామి: చింతాడ గ్రామానికి చెందిన ఇద్దరు పింఛనుదారులు అనారోగ్యంతో శృంగవరపు కోట సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు బాలాజీ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించారు. దీంతో పింఛనుదారులు సంతోషం వ్యక్తం చేశారు.



ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

వైద్యులున్నా.. సేవలు అంతంత మాత్రమే!

- గజపతినగరం అదనపు పీహెచ్‌సీకి వసతి లేక రోగులకు ఇక్కట్లు

గజపతినగరం: ఎక్కడైనా వైద్యులు కొరత ఉంటే అక్కడ రోగులకు వైద్య సేవలు కొరవడతాయి. అక్కడ వైద్యులు పూర్తి స్థాయిలో ఉన్నా రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇదీ మరుపల్లి పీహెచ్‌సీ దుస్థితి. మండలంలోని జనాభా ప్రాతిపదికన అదనపు పీహెచ్‌సీ మంజూరు చేయాలని గత పదేళ్లుగా వైద్యాధికారులు మొర పెట్టుకున్నారు. మండలంలోని 30 పంచాయతీలకు 63వేల 579 మంది జనాభా ఉన్నారు. జనాభా ప్రాతిపదికన గత ప్రభుత్వం మండలానికి రెండు పీహెచ్‌సీలు అవసరంగా భావించి గత ఏడాది మార్చి నెలలో అదనపు పీహెచ్‌సీని మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఇద్దరు వైద్యాధికారులను నియమించారు. అదనంగా వచ్చిన ఇద్దరు వైద్యాధికారులకు గజపతి నగరంలోని ఏరియా ఆసుపత్రిలో ఒక గదిని ఏర్పాటు చేశారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాలు ఉండగా మరుపల్లి సెక్టారుకు 10 గ్రామ సచివాలయాలు, గజపతినగరం సెక్టారుకు 11 గ్రామ సచివాలయాల్లో ఇద్దరు వైద్యుల చొప్పున వైద్య సేవలు అందజేయాల్సి ఉంది. అయితే వైద్యులను నియమించిన ప్రభుత్వం అందుకు అవసరమైన భవనాన్ని కల్పించకపోవడంతో నలుగురు వైద్యులు మరుపల్లి పీహెచ్‌సీలో ఉంటున్నారు. దీంతో సుదూర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందడంలేదు. మండలంలోని గజపతినగరం సెక్టారు పరిధిలో జిన్నాం గ్రామంలో అదనంగా పీహెచ్‌సీ ఏర్పాటు చేసినట్లయితే జిన్నాంతో పాటు కెంగువ, తుమ్మికాపల్లి, లోగిస, రామన్నపేట, లింగాలవలస, జిన్నాం, రంగుపురం, ముచ్చర్ల, కొండపేట గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందేవి. పక్కా భవనం లేకపోవడంతో వైద్యులు మరుపల్లికే పరిమితం కావడంతో గజపతినగరం సెక్టారు పరిధిలోగల గ్రామాలకు చెందిన రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడంలేదు. ఒక వైపు పీహెచ్‌సీలో ప్రసవాలు జరగాలని ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోవడంలేదు. గజపతినగరం సెక్టారుకు సంబంధించి రోగులు, గర్భిణులు గజపతినగంలోగల ఏరియా ఆసుపత్రికి గానీ విజయగనరం గానీ మెరుగైన వైద్యం కోసం వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనపు పీహెచ్‌సీకి భవనం సమకూర్చి రోగులకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలోకి తీసుకువెళ్లాం

గజపతినగరం మండలానికి అదనంగా పీహెచ్‌సీ మంజూరు అయినా భవనం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జనాభా అధికం కావడంతో దూర ప్రాంతాల రోగులు మరుపల్లి పీహెచ్‌సీ వచ్చే పరిస్థితి లేదు. సేవలకు దూరమవుతున్నారు. జిన్నాంలో అదనపు భవనం ఏర్పాటు జరిగితే పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందుతాయి. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

\- సాయికృష్ణారెడ్డి, వైద్యుడు, మరుపల్లి పీహెచ్‌సీ



మరుపల్లి పీహెచ్‌సీ

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి

- ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల: అధ్యాపకులు, విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆమె విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అంతకుముందు కళాశాల ఆవరణలో నిర్మించిన కళావేదికను ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పన, అదనపు తరగతి భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, జనసేన నాయకులు రవ్వా నాని, ఎంఎం నాయుడు, అంబళ్ల అప్పలనాయుడు, నల్లి శేఖర్, ఎడ్ల గోవిందరావు, గదల అచ్చింనాయుడు, కరుమజ్జి గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పీవో లెంక సంధ్య తదితరులు పాల్గొన్నారు. ●



నెల్లిమర్ల: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

డెంకాడ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శుక్రవారం డెంకాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, టీడీపీ మండలం అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, కలిదిండి పాణిరాజు, కాగితాల సత్యనారాయణరెడ్డి, కొర్నాన ఆదిబాబు, కంది కిరణ్, పైల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలకు పెంచాలి

నెల్లిమర్ల: ఈపీఎఫ్ ఉద్యోగులకు, కార్మికులకు కనీస పెన్షన్ రూ.9వేలు చేయాలని ఈపీఎఫ్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లిమర్ల పోస్టాఫీస్ వద్ద నిరసన చేపట్టారు. డిల్లీలో ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. పద్మనాభం, అప్పలసూరి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వామపక్ష సంఘాల నాయకులు

పదో తరగతి టాపర్‌కు ప్రోత్సాహకం

దత్తిరాజేరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన రుంకాన భారతికి గొర్తి ఈశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పి.రఘువర్మ రూ.10వేల చెక్కును అందజేశారు. ఈ ట్రస్టు ద్వారా స్కూల్ టాపర్‌గా నిలిచిన వారికి రూ.10వేలు, 10/10 మార్కులు సాధించిన వారికి రూ.25వేలు అందజేస్తారు. ఇప్పటివరకు 185 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చప్ప అప్పలనాయుడు, జోగి నాయుడు, బైరాగిరాజు, ట్రస్టు సమన్వయకర్త బి.అప్పలనాయుడు, హెచ్ఎం పి.రామునాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

- వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఐసీడీఎస్, పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ర్యాలీలు
- పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన



రామభద్రపురం సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జామి: అలమండలో తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



దత్తిరాజేరు: తల్లి పాల విశిష్టతను వివరిస్తున్న దృశ్యం

గరివిడి: పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి అన్నారు. శేరీపేట గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె.. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** బిడ్డకు పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామభద్రపురం అంగన్‌వాడీ సెంటర్-1లో ర్యాలీ నిర్వహించారు. ● **శృంగవరపుకోట రూరల్ /జామి:** తల్లిపాలు బిడ్డకు అమృతం అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విమలదేవి, లక్ష్మి అన్నారు. మండలంలోని ధర్మవరం, జామి మండలం అలమండ, భీమసింగి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ● **రాజాం రూరల్:** మొదటి ఆరునెలల వరకూ బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ రాజాం సెక్టార్ సూపర్‌వైజర్ సన్యాసమ్మ స్పష్టం చేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మల్లిఖార్జున కాలీలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ● **కొత్తవలస:** తల్లిపాలు శ్రేష్ఠమైనవి, వెలకట్టలేనివని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని రామలింగపురంలో గర్భిణుకుల, బాలింతకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ● **దత్తిరాజేరు:** తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెదమానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** గొల్లపేట గ్రామంలో శుక్రవారం మిమ్స్ నర్సింగ్ కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో యాంటీనేటల్ డే, తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ షమ్‌షేర్ బేగం వివరించారు. ప్రసవం తర్వాత పిల్లలకు పాలిచ్చే విధానాలను వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు. ● **గంట్యాడ:** అమ్మపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మదనాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు చాలా ఉపయోగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణ తగదు

- సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ నిరసన

ఎస్సీల వర్గీకరణ చేస్తామని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం దారుణమని దళిత సంఘ నేతలు ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో డిల్లీలో సామాజిక చైతన్య దీక్షలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు బొబ్బిలిలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నేతలు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



దాసన్నపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన



బొబ్బిలి: పోస్టర్లు విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు



వంగర: అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన



గరివిడి: నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

సుప్రీం తీర్పు హర్షణీయం

రాజాం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పుపై మాదిగలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పాలకొండ రోడ్డులో అంబేడ్కర్ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ● **బొబ్బిలి:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై భారత అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించడం హర్షణీయమని జిల్లా ఎంఆర్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాగాన సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓ దార్శనికుడని మరోసారి రుజువైందన్నారు. విద్య ఉద్యోగాల్లో మాదిగల ఉపకులాల్లో ఉన్న పేదలందరికీ ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు.



రాజాం: అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలోని పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది ఒక్కొక్కరూ వ్యక్తిగతంగా కలిసి శాఖాపరమైన, వ్యక్తిగత సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ



